RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in




సంపుటి -13 సంచిక - 451 | 16 ఆదివారం ఆగస్టు 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

## ‘ఆయన చెప్పింది నిజమే’..

### రాజగోపాల్ రెడ్డికి కేటీఆర్ మద్దతు!



కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన తీవ్ర ఆరోపణలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మద్దతు తెలిపారు. అభివృద్ధి పేరుతో కొందరు అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.లక్షల కోట్లు దోచుకుంటున్నారని రాజగోపాల్ చేసిన వ్యాఖ్యలతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నానని కేటీఆర్ అన్నారు. పేదలకు ఇల్లు కట్టుకోవడానికి రూ.5-6 లక్షలు ఇవ్వాలంటే ప్రభుత్వం 500 నిబంధనలు పెడుతోందని రాజగోపాల్ రెడ్డి విమర్శించారు. అదే సమయంలో పెద్ద మొత్తంలో దోపిడీ జరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆయన ధ్వజమెత్తారు.రాజగోపాల్ రెడ్డి ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వంపై నేరుగా విమర్శలు చేశారు. అభివృద్ధి పేరుతో రాష్ట్రాన్ని దోచుకుంటున్న వారిపై పోరాడతానని హెచ్చరించారు. తన సహనాన్ని చేతకానితనంగా భావించవద్దని అన్నారు. పేదల ఇళ్ల విషయంలో నిబంధనలు కఠినంగా పెడుతున్న ప్రభుత్వం భారీ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు వేల కోట్ల అవినీతికి పాల్పడుతున్నారన్న రాజగోపాల్ రెడ్డి మాటలు నిజమేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలను సొంత పార్టీ ఎమ్మెల్యేలే చేస్తున్నారని చెప్పారు. తెలంగాణను రాహుల్ గాంధీ, ఏఐసీసీకి ఏటీఎంగా మార్చుకున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. తెలంగాణకు వచ్చిన ప్రతిసారీ ప్రధాని మోదీ రాష్ట్రం ఏఐసీసీకి ఏటీఎంగా మారిందని చెబుతున్నారని కేటీఆర్ గుర్తుచేశారు. మరి అలాంటి ఆరోపణలు వస్తున్నప్పుడు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఈడీ దాడులు జరిగినా ఆ తర్వాత ఎలాంటి చర్యలు కనిపించలేదన్నారు.

### ఫామ్‌హౌస్‌లో కాదు..

# అసెంబ్లీలోకి రా..

### - కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి సవాల్



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. రైతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మేలు, బీఆర్ఎస్ హయాంలో జరిగిన అన్యాయాలపై చర్చించేందుకు అసెంబ్లీకి రావాలని అన్నారు. ఫామ్‌హౌస్‌లో ఉండి విమర్శలు చేయడం కాదని, ప్రజల ముందుకు వచ్చి మాట్లాడాలని అన్నారు. సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారు.గతంలో వరి వేస్తే ఉరి అన్న కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌లో మాత్రం వరి పండించారని రేవంత్ విమర్శించారు. ఇప్పుడు రైతులకు మేలు చేసే కార్యక్రమాలు చేపడుతుంటే బీఆర్ఎస్ విమర్శలు చేస్తోందన్నారు. రైతుల సంక్షేమంపై నిజమైన చర్చకు సిద్ధమైతే అసెంబ్లీ వేదికగా మాట్లాడుకుందామని సవాల్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై బీఆర్ఎస్, బీజేపీ ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని రేవంత్ అన్నారు. ఈ రెండు పార్టీలు ఒకే నాణేనికి బొమ్మా బొరుసులాంటివని వ్యాఖ్యానించారు. పదేళ్లు అధికారంలో ఉన్నా పేదలకు సన్నబియ్యం ఇవ్వాలనే ఆలోచన ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు.కాంగ్రెస్ వస్తే కరెంట్ కోతలు వస్తాయని గతంలో బీఆర్ఎస్ ప్రచారం చేసిందని, కానీ ఇప్పుడు రాష్ట్రంలో విద్యుత్ కోతలు లేవని రేవంత్ చెప్పారు. రైతు భరోసా పథకం కింద 32 నెలల్లో రూ.36 వేల కోట్లు 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నివేదికల ప్రకారం దేశంలో తక్కువ అప్పులు ఉన్న రైతులు తెలంగాణలోనే ఉన్నారని అన్నారు. బీజేపీ నేతలు ఆ నివేదికలు చదివితే నిజాలు తెలుస్తాయని వ్యాఖ్యానించారు.స్మార్ట్ రేషన్ కార్డులు కేవలం ప్లాస్టిక్ కార్డులు కావని, పేదల ఆత్మగౌరవానికి గుర్తని రేవంత్ చెప్పారు. ఆకలి తీర్చే భరోసానే ఈ కార్డుల ఉద్దేశమని అన్నారు. పేదలకు ఆహార భద్రత కల్పించేందుకు రేషన్ వ్యవస్థను తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని పేర్కొన్నారు.

## వెయ్యి కోట్లు ఇచ్చినా జగ్గారెడ్డి వంటి వారు దొరకరు

### : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంస



సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంసల వర్షం కురిపించారు. వెయ్యి కోట్ల రూపాయలు వెచ్చించినా జగ్గారెడ్డి వంటి నాయకుడు దొరకరని ఆయన వ్యాఖ్యానించారు. ఇవాళ సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ముఖ్యమంత్రి చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని శ్రీరాముడు అనుకుంటే, జగ్గారెడ్డి ఆయనకు హనుమంతుడి వంటి వారని అభివర్ణించారు. “నాయకులకు మార్కులు వేస్తే నాకంటే జగ్గారెడ్డికే ఎక్కువ వస్తాయి. అలాంటి నాయకుడిని ఓడించడం ఈ ప్రాంత ప్రజల దురదృష్టం“ అని సంగారెడ్డి ప్రజలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ జగ్గారెడ్డి నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ పనిచేస్తున్నారని రేవంత్ రెడ్డి కొనియాడారు. “కుటుంబాన్ని సైతం పక్కనపెట్టి ప్రజల కోసం నిరంతరం శ్రమించే నాయకుడు ఆయన. ఇక్కడ పరిస్థితులు ఎలా ఉన్న, జగ్గారెడ్డి కచ్చితంగా ప్రజా జీవితంలోనే ఉండాలి“ అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

### అర్హులందరికీ రేషన్ కార్డులు..

## నిరంతర ప్రక్రియ : మంత్రి ఉత్తమ్



రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తామని, ఇది నిరంతర ప్రక్రియ అని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం సంగారెడ్డిలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేసిందని, ఇది ఒక చారిత్రక ఘట్టమని అభివర్ణించారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. గతంలో ప్రజలకు నాణ్యత లేని దొడ్డు బియ్యాన్ని సరఫరా చేసేవారని, అయితే తమ ప్రభుత్వం రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించి సన్న బియ్యాన్ని సేకరిస్తోందని తెలిపారు. దేశంలో మరే ఇతర రాష్ట్రంలో లేని విధంగా ప్రతి వ్యక్తికి 6 కిలోల చొప్పున సన్న బియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నట్లు ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, స్మార్ట్ రేషన్ కార్డు కేవలం ఆహార భద్రతకే కాకుండా, అది ఒక కుటుంబానికి ప్రభుత్వం కల్పించే గౌరవం, గుర్తింపు అని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో లేని ఎన్నో సంక్షేమ పథకాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోందని, అందులో భాగంగానే ప్రతి నియోజకవర్గానికి 3,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారి అర్హతలను పరిశీలించి, త్వరలోనే వారికి కూడా కార్డులు జారీ చేస్తామని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

### నల్గొండ నా ఊపిరి..

## అభివృద్ధే నా ధ్యేయం

### : కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్గొండ జిల్లాను అభివృద్ధి పథంలో పయనింపజేసి, తెలంగాణ రాష్ట్రానికే ఆదర్శంగా నిలబెట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్గొండ పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో ఆయన పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసు బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించి జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నల్గొండ నేల చూపిన త్యాగం, ఆత్మగౌరవం స్వాతంత్ర్య స్ఫూర్తికి ప్రతీకలని అభివర్ణించారు. తన శ్వాస ఉన్నంత వరకు జిల్లా ప్రజల ఆశలు, ఆకాంక్షల కోసమే పనిచేస్తానని చెప్పారు. జిల్లాలో సాగు, తాగునీటి కష్టాలను శాశ్వతంగా తీర్చే బాధ్యత తాను తీసుకుంటానని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమానికి పెద్దపీట వేస్తూ 5.35 లక్షల మంది రైతులకు రూ. 715 కోట్ల రైతు భరోసా, 1.99 లక్షల మంది పింఛనుదారులకు రూ. 51.28 కోట్లు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే 17,873 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి 4,360 ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేశామని, 2.56 లక్షల కుటుంబాలకు గృహజ్యోతి కింద ఉచిత విద్యుత్ అందిస్తున్నామని వివరించారు. నల్గొండ పట్టణంలో 24 గంటల మంచినీటి సరఫరా లక్ష్యంతో రూ. 83 కోట్ల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడమే కాకుండా, పట్టణాభివృద్ధి కోసం మరో రూ. 300 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు వెల్లడించారు. యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు రూ. 20 కోట్లతో ఎన్‌ఏసీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని, అమరవీరుల త్యాగాల సాక్షిగా నల్గొండ జిల్లాను అన్ని రంగాల్లోనూ ప్రథమ స్థానంలో నిలబెడతానని హామీ ఇచ్చారు.

### 22ఏ పేరుతో భారీ

## దోపిడీ జరుగుతోంది

### : బండి సంజయ్



తెలంగాణలో నిషేధిత భూముల జాబితా (22ఏ) ముసుగులో భారీ దోపిడీ సాగుతోందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనల మధ్య ఎలాంటి తేడా లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో ఉన్న 2.77 కోట్ల ఎకరాల్లో ఏకంగా 95 లక్షల ఎకరాలను 22ఏ నిషేధిత జాబితాలో ఎలా చేరుస్తారని బండి సంజయ్ నిలదీశారు. ప్రజలు కష్టపడి కొనుక్కున్న స్థలాలు, పరిశ్రమలకు కేటాయించిన భూములు, ప్రభుత్వమే వేలం వేసిన భూములను కూడా ఈ జాబితాలో చేర్చి వేధిస్తున్నారని విమర్శించారు. విద్యాసంస్థల ఫీజు రీయింబర్స్ మెంట్ పాత బకాయిలను ఇంకా చెల్లించకుండా, వచ్చే విద్యా సంవత్సరం నుంచి అడ్వాన్స్ ఇస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. జెన్-జీ యువతకు స్థానం కల్పిస్తామనే కాంగ్రెస్ మాటలు నిజమైతే... వెంటనే యువకులకు మంత్రి పదవులు, ఎమ్మెల్సీ సీట్లు కేటాయించాలని సవాల్ విసిరారు.

### బ్రిటీష్ కాలం నాటి కుట్రలు నేటి తరానికి

## తెలియాల్సిన అవసరం ఉంది: కవిత



ఆంగ్లేయుల పాలనలో జరిగిన దారుణాలు, సమాజాన్ని ముక్కలు చేయడానికి వారు అవలంబించిన ‘విభజించి పాలించే’ కుట్రల గురించి నేటి తరానికి పూర్తి స్థాయిలో తెలియాల్సిన అవసరం ఉందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత స్పష్టం చేశారు. మన చరిత్రను సరిగ్గా అర్థం చేసుకున్న వారు మాత్రమే దేశ భవిష్యత్తును అద్భుతంగా నిర్మించగలరని ఆమె అన్నారు.తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో కవిత పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రెండు ప్రపంచ యుద్ధాల్లో భారతీయ సైనికులను బలవంతంగా వాడుకుని వేలాదిమంది ప్రాణాలను బ్రిటీషర్లు బలితీసుకున్నారని మండిపడ్డారు. వారు తెచ్చిన విధానాల వల్లే దేశంలో కుల వ్యవస్థ మరింత తీవ్రతరమైందని, అడవుల్లో ప్రశాంతంగా జీవించే ఆదివాసీలను రాజ్యం పరిధిలోకి తెచ్చి తీరని అన్యాయం చేశారని ధ్వజమెత్తారు.బ్రిటీష్ పాలకులు దేశం విడిచి వెళ్లినా, వారి ఆలోచనా వైఖరి మాత్రం ఇంకా ఇక్కడే ఉండిపోవడం విచారకరమని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఇంగ్లీష్ మాట్లాడేవారే గొప్ప అన్నట్లుగా చూస్తూ, మాతృభాష అయిన తెలుగు మాట్లాడేవారిని తక్కువ చేసి చూడడం ఆనాటి గులాంగిరీకి నిదర్శనమన్నారు. చర్మం రంగును బట్టి మన మధ్య వైషమ్యాలు సృష్టించిన ఆనాటి మైండ్‌సెట్‌ను వీడి, స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా ముందుకెళ్లాలని ఆమె పిలుపునిచ్చారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# స్మార్ట్ రేషన్ కార్డులతో పౌరసేవల్లో పారదర్శకత






హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 15:- సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ప్రజాపంపిణీ వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడంతో పాటు అర్హులైన ప్రతి కుటుంబానికి పారదర్శకంగా పౌరసేవలు అందించడమే లక్ష్యంగా స్మార్ట్ రేషన్ కార్డులను అందుబాటులోకి తెచ్చామని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. బొంగ్లూర్ గేట్ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా స్థాయి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మంత్రి శ్రీధర్ బాబుతో పాటు ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, ప్రకాశ్ గౌడ్, అరికెపూడి గాంధీ, ఈర్లపల్లి శంకరయ్య, కలెక్టర్ నారాయణరెడ్డి, జేసీ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు మంత్రి చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. స్మార్ట్ కార్డుల ద్వారా ఆహార భద్రత పథకాల అమలులో జవాబుదారీతనం పెరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. గతంలో రేషన్ కార్డుల జారీ, కుటుంబ సభ్యుల పేర్ల నమోదులో జాప్యం జరిగేదని, కొత్తగా పెళ్లైన మహిళలు, పుట్టిన పిల్లల పేర్లు సైతం ఏళ్ల తరబడి కార్డుల్లో నమోదు కాని పరిస్థితులు ఉండేవని అన్నారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొత్త రేషన్ కార్డుల జారీతో పాటు ఉచిత సన్నబియ్యం పంపిణీ చేపట్టామని తెలిపారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కృషితో సుమారు 15 వేల కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయని, జిల్లాలో 90,276 కార్డుల ద్వారా 2.96 లక్షల మంది లబ్ధి పొందనున్నారని మంత్రి వెల్లడించారు. త్వరలో రేషన్ డీలర్ల నియామకాలు చేపడతామని చెప్పారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు వేగంగా, పారదర్శకంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. స్మార్ట్ రేషన్ కార్డు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు కీలక గుర్తింపు పత్రంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

# జాతీయ పతాకానికి ఘన వందనం.. మంచిరెడ్డి కిషన్ రెడ్డి





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 15:- ఇబ్రహీంపట్నం: 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి జాతీయ గీతాన్ని ఆలపించి దేశభక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాతావరణంలో జీవిస్తున్నామని అన్నారు. దేశ ప్రగతి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య విలువలు, దేశ సమగ్రత, ఐక్యతను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల సందర్భంగా మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి)తో పాటు పలువురు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు. జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం దేశభక్తి నినాదాలతో ఉత్సాహంగా కొనసాగింది.

# సమానత్వ సమాజమే స్వాతంత్ర్య సమరయోధులకు నిజమైన నివాళి






హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 15:- ఇబ్రహీంపట్నం: దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాల ఫలితంగానే భారతదేశానికి బానిస సంకెళ్ల నుంచి విముక్తి లభించిందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. సమాజంలో అసమానతలను తొలగించి, అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు కల్పించడమే స్వాతంత్ర్య సమరయోధులకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఇబ్రహీంపట్నం ప్రజాభవన్‌తో పాటు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తొలుత ఇబ్రహీంపట్నం ప్రజాభవన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించి జెండా వందనం చేశారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. తదుపరి రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి మల్ రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధులు, సమాజ సేవలో విశేష సేవలందిస్తున్న ప్రముఖులు, ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాల అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తూ, అన్ని సామాజిక వర్గాల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని వారు తెలిపారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ ప్రభుత్వ శాఖల స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# ఘనంగా ఆదిభట్ల మున్సిపల్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 15:- ఆదిభట్ల సర్కిల్15 పరిధిలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. రాగన్నగూడలోని సర్కిల్ కార్యాలయంలో ఉదయం 9:05 గంటలకు జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ బి. సత్యనారాయణ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జెండాకు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం జాతీయ నాయకుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి, వారి సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాలు, పోరాటాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అన్నారు. స్వేచ్ఛా భారతదేశ అభివృద్ధిలో ప్రతి పౌరుడి పాత్ర ఎంతో కీలకమని, ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సిబ్బందికి సూచించారు. దేశ ప్రగతికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆదిభట్ల సర్కిల్ అధికారులు, ఉద్యోగులు, పారిశుద్ధ్య సిబ్బంది, ఫీల్డ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు అధికారులకు ప్రతిభా పురస్కారాలు







హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 15:- స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలో ఉత్తమ సేవలు అందించిన పోలీసు అధికారులను ప్రశంసా పత్రాలతో సత్కరించారు. ఇబ్రహీంపట్నం డివిజన్ ఏసీపీ రాజు, ఇబ్రహీంపట్నం ఎస్‌హెచ్‌ఓ మహేందర్ రెడ్డి, ఫార్మాసిటీ ఎస్‌హెచ్‌ఓ సత్యనారాయణలు తమ విధుల్లో ప్రతిభ కనబరిచినందుకు ఈ గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా ఏసీపీ రాజు మాట్లాడుతూ.. పోలీసు అధికారులు, సిబ్బంది అందిస్తున్న సేవలను గుర్తించి ప్రశంసా పత్రాలు అందించడం మరింత బాధ్యతగా పనిచేయడానికి ప్రోత్సాహాన్ని ఇస్తుందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతామని చెప్పారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఏసీపీ వెల్లడించారు. గంజాయి తదితర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రజల భద్రతకు నిరంతరం కృషి చేస్తారని ఏసీపీ రాజు పేర్కొన్నారు.

# అన్ని మతాలు ఐక్యంగా ఉంటేనే దేశం సస్యశ్యామలం



హైదరాబాద్, ఆగస్టు 15: అన్ని మతాల ప్రజలు ఐక్యంగా, శాంతియుతంగా జీవించినప్పుడే దేశం సస్యశ్యామలంగా అభివృద్ధి చెందుతుందని సెంట్రల్ పీస్ కమిటీ సికింద్రాబాద్ జోన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్. శరత్ శ్యామ్ పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సెంట్రల్ పీస్ కమిటీ ఆధ్వర్యంలో బర్కత్‌పురాలో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సెంట్రల్ పీస్ కమిటీ అధ్యక్షుడు ఎస్. నారాయణ రెడ్డితో కలిసి వర్కింగ్ ప్రెసిడెంట్ శరత్ శ్యామ్ మాట్లాడుతూ.. దేశ అభివృద్ధికి మత సామరస్యం, శాంతి, ఐక్యత ఎంతో అవసరమని అన్నారు. ప్రజలంతా పరస్పరం గౌరవించుకుంటూ శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హస్రీద్ ముజాఫర్, మోయిస్, శ్రీ కిషన్ శర్మ, బసంత్ కౌర్ తో పాటు వివిధ జోన్లకు చెందిన సెంట్రల్ పీస్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. ర్యాలీలో జాతీయ జెండాలను ప్రదర్శిస్తూ దేశభక్తి నినాదాలు చేశారు.

# నాగ పంచమి వేడుకలకు ముస్తాబైన శ్రీ పేరూరు సరస్వతీ మాత ఆలయం

## ఈనెల 17న ఆలయంలో గరుడ నాగ పంచమి మహోత్సవాలు ఆలయ అర్చకులు మహేష్ హైటెక్ పంతులు









మెదక్,ఆగస్టు15(హైద్రాబాద్ ఎస్టేట్):మెదక్ మండల పరిధిలోని పేరూరు గ్రామ శివారు లోని మంజీరా నది ఒడ్డున స్వయంభువుగా వెలసిన శ్రీ సరస్వతీ మాత ఆలయం. మంజీరా నది ఒడ్డున జనమే జయుడు సర్పయాగం చేసిన స్థలంలో ఇప్పటికీ తవ్వినకొద్దీ విభూతి వస్తుంది..

ఇలాంటి ప్రత్యేకత సంతరించుకున్న ఆలయంలో ఈనెల 17న (సోమవారం) గరుడ నాగ పంచమి మహోత్సవ కార్యక్రమానికి భక్తులకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు కల్పించినట్లు ఆలయ వ్యవస్థాపకులు దొర్బల రాజ మౌళిశర్మ,ప్రధాన అర్చకులు హైటెక్ మహేష్ పంతులు శర్మలు తెలిపారు.

ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గరుడ నాగ పంచమి వేడుకలలో ఉదయాన్నే స్వామీ వారికి సర్పదోష నివారణ పూజలు,కాల సర్పదోష నివారణ పూజలు,నాగ దోష నివారణ పూజలు,వివాహ ప్రాప్తి పూజలు,సంతాన ప్రాప్తి పూజలు,ఆరోగ్య శాంతి పూజలు,ఆర్థికాభివృది పూజలు,అశ్రీగ్రహ,భావగ్రహ శాంతి పూజలు,కుజ, రాహు,కేతుగ్రహ శాంతి పూజలు,పంచామృత అభిషేకములు, అమ్మవారికి నైవేద్యం,మంగళ హారతి, మంత్ర పుష్పం,అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమానికి ఆయా గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై తమకు తోచిన విధంగా ఆర్థిక సహాయం అందజేసి స్వామీ వారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

# నారాయణగూడ ఐపీఎంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



హైదరాబాద్, ఆగస్టు 15: నారాయణగూడలోని ఐపీఎంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడ్డాయి. ఐపీఎం టీఎన్జీవోస్ బ్రాంచ్ అధ్యక్షుడు ఎం. శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అసోసియేట్ అధ్యక్షుడు ఎం. సత్యనారాయణ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. జెండా ఆవిష్కరణ అనంతరం జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎం. సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీఎన్జీవోస్ యూనియన్ ఎల్లప్పుడూ ముందుండి కృషి చేస్తుందని తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, వృత్తి భద్రత కోసం యూనియన్ నిరంతరం కట్టుబడి పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల అభివృద్ధి కోసం సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ టీఎన్జీవోస్ గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ కోశాధికారి ఏ. శ్రీనివాస్‌తో పాటు పలువురు ఉద్యోగులు, యూనియన్ ప్రతినిధులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## జాతీయ పతాకాన్ని ఎగరవేసిన తరుణ్ జోషి



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 15 ఇబ్రహీంపట్నం: నూతనంగా ఏర్పడిన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలోని ప్రధాన కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి, ఐపీఎస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసు సిబ్బందికి, ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం ప్రతి తరానికి బాధ్యతను కూడా అప్పగించిందని, ప్రజలు భయరహితంగా జీవించేలా పోలీసు వ్యవస్థ పనిచేయాలని అన్నారు. బలమైన ప్రజాస్వామ్యానికి వృత్తిపరమైన నైపుణ్యం, నిష్పక్షపాతత్వం, మానవీయ దృక్పథంతో కూడిన పోలీసింగ్ అవసరమని పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీని ఆధునిక, సాంకేతికత ఆధారిత, సుస్థిర నగరంగా అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో పోలీసింగ్ వ్యవస్థను కూడా ఆధునిక విధానాలతో రూపొందించే అవకాశం లభించిందన్నారు. స్మార్ట్, సేఫ్, సెక్యూర్ అనే విజన్‌తో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ స్మార్ట్ పోలీసింగ్, మహిళలు, చిన్నారులు, బలహీన వర్గాలకు భద్రత, డిజిటల్ ముప్పులతో పాటు అన్ని రకాల నేరాల నియంత్రణకు చర్యలు చేపడతామన్నారు. ప్రజల విశ్వాసమే పోలీసింగ్‌కు అసలైన బలమని, సాంకేతిక అభివృద్ధితో పాటు మానవీయ విలువలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మరింత చేరువగా పనిచేస్తామని కమిషనర్ స్పష్టం చేశారు. వేడుకల్లో సీనియర్ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం.. అనంతరెడ్డికి అభినందనలు



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 15:- ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఎలిమినేడు గ్రామానికి చెందిన మంచిరెడ్డి అనంతరెడ్డి విద్యార్థులను ప్రోత్సహించేలా తన వంతు సహకారం అందించారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎలిమినేడు ప్రాథమికోన్నత పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న ప్రతిభావంతులైన ఇద్దరు విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. తరగతిలో మొదటి స్థానంలో నిలిచిన నవదీప్‌కు రూ. 1,116 నగదు బహుమతిని అందించారు. అదేవిధంగా రెండో స్థానంలో నిలిచిన విద్యార్థికి కూడా నగదు బహుమతి అందించారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి, పోటీ తత్వాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ ప్రోత్సాహకాలను అందించినట్లు తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించిన అనంతరెడ్డి సేవలను గ్రామస్తులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, యువజన సభ్యులు అభినందించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమని పేర్కొంటూ అనంతరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఇబ్రహీంపట్నం కోర్టులో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 15:- ఇబ్రహీంపట్నం అదనపు జిల్లా కోర్టు ప్రాంగణంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అదనపు జిల్లా జడ్జి ప్రవీణ్ కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరంలో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. వారి త్యాగాల స్ఫూర్తితో సమాజ అభివృద్ధికి, దేశ ప్రగతికి కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు న్యాయవ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి రీటాలాల్ చంద్ కార్యక్రమానికి అధ్యక్షత వహించి స్వాగత ప్రసంగం చేశారు. సీనియర్ సివిల్ జడ్జి ఈశ్వరయ్య, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ కార్యక్రమంలో పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి. రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఆకుల బిక్షపతి, ప్రధాన కార్యదర్శి బి. శ్రీనాథ్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి దాసరి శ్రీనివాస్ యాదవ్, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శి పొట్టి గణేష్, లైబ్రరీ కార్యదర్శి పల్లె ధనంజయ గౌడ్, కార్యవర్గ సభ్యులు ప్రవీణ్, కావ్యతో పాటు పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. కోర్టు సిబ్బంది, పోలీసు సిబ్బంది కూడా వేడుకల్లో పాల్గొని జాతీయ సమైక్యత, దేశభక్తిని చాటారు.

## నవ జ్యోతి యూత్ ఆధ్వర్యంలో 80 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



హైదరాబాద్ ఎస్టేట్ యాచారం ప్రతినిధి రామాచారి ఆగస్టు 15 రంగారెడ్డి జిల్లా యాచారం మండలం ధర్మన్నగూడ గ్రామంలో నవజ్యోతి యూత్ ఆధ్వర్యంలో ఘనంగా స్వతంత్ర దినోత్సవ వేడుకలు చాలా వైభవంగా జరిగాయి ఇట్టి కార్యక్రమంలో యూత్ ప్రెసిడెంట్ నీల ధనరాజ్ జండా ఆవిష్కరణ చేసి జాతీయ గీతాన్ని ఆలపించి స్వాతంత్ర సమర యోధుల ప్రాణార్పణ గురించి మాట్లాడారు భారతదేశాన్ని ఆంగ్లేయుల పాలనలో మన పూర్వీకులు పడ్డటు వంటి ఇబ్బందులను సాధించిన విజయాలను తెలియజేస్తూ 80 వ స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనడంనాకు గర్వకారణం అని తెలియజేశారు నవ జ్యోతి యూత్ సభ్యులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారికి అండదండగా ఉంటానని తను మాట ఇచ్చారు ఈ కార్యక్రమంలో నవ జ్యోతి యూత్ యువకులు పాల్గొన్నారు

## మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలి



హైదరాబాద్, ఆగస్టు 15: దేశ స్వాతంత్ర్యం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన మహనీయుల సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అవంతి కళాశాల ప్రిన్సిపల్ నాగరాజు పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, దేశభక్తి, సేవా స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు.

బర్కత్‌పురలోని అవంతి కళాశాలలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ నాగరాజు జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధులు, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నాగరాజు మాట్లాడుతూ స్వాతంత్ర్యం సాధించడం వెనుక ఎంతోమంది మహనీయుల త్యాగాలు, పోరాటాలు ఉన్నాయని అన్నారు. వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణ, నైతిక విలువలు, దేశభక్తిని అలవర్చుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో విద్యార్థులకు వివిధ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యం తరఫున బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. విజేతలను కళాశాల ప్రిన్సిపల్, యాజమాన్య ప్రతినిధులు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ (హెచ్‌ఆర్) డాక్టర్ జయప్రద, కార్యదర్శి సాయిరాం, హెచ్‌ఓడీ వేణుగోపాల్‌తో పాటు అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. జాతీయ భావాన్ని చాటుతూ విద్యార్థులు ఉత్సాహంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.

## పాపన్నపేట చేనేత సహకార సంఘం వద్ద ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు : చైర్మన్ కొడపాక విట్టల్ మెదక్





,ఆగస్టు15(హైద్రాబాద్ ఎస్టేట్):మెదక్ జిల్లా, మండల కేంద్రమైన పాపన్నపేట చేనేత సహకార సంఘం వద్ద శనివారం రోజు 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా చేనేత సహకార సంఘం చైర్మన్ కొడపాక విట్టల్ కొబ్బరికాయ కొట్టి జండా విష్కర చేశారు. ఈకార్యక్రమంలో చేనేత సహకార సంఘం చైర్మన్ కొడపాక విఠల్, ఉపాధ్యక్షులు పల్లె సంగమేశ్వర్, ప్రధాన కార్యదర్శి,డైరక్టర్లుదాసరి యాదగిరి,పల్లె లక్ష్మణ్, జూకంటి సంగయ్య, పద్మశాలి సంఘం మండల అధ్యక్షులు వళ్ళందేశీ శ్రీనివాస్,పద్మశాలి నాయకులు పోల శ్రీనివాస్,పల్లె రాములు,శివకుమార్, చామంతుల మల్లయ్యా, తూర్పు రాములు,తూర్పు రమేష్,యూగేందర్, బీకొండ రాములు, సంపత్,పల్లె సాయి,రాజేష్,పల్లె రాజు,కొడపాక బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## టేక్మాల్ విద్యుత్ కార్యాలయం వద్ద ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు : ఏఈ ఉదయ్ భాస్కర్



మెదక్,ఆగస్టు15(హైద్రాబాద్ ఎస్టేట్):

మెదక్ జిల్లా,మండల కేంద్రమైన టేక్మాల్ విద్యుత్ కార్యాలయం వద్ద శనివారం రోజు 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఏఈ బి. ఉదయ్ భాస్కర్ జండా వద్ద కొబ్బరి కాయ కొట్టి జండవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంతో మంది దేశ భక్తులు త్యాగాల ఫలితంగానే మనం ఈరోజు స్వేచ్ఛగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ దేశం కోసం పోరాడాలని, తాము నిర్వహిస్తున్న విధులు అంకిత భావంతో పూర్తి చేయాలని సూచించారు.

ఈకార్యక్రమంలో విద్యుత్ లైన్ ఇన్స్పెక్టర్ లు దుర్గా ప్రసాద్,సూర్య నారాయణ,లైన్ మేన్ లు బి. దుర్గయ్య, పాండ్యబ నాయక్, ఏఎల్ ఏం పండిత్, జూనియర్ లైన్మెన్ పడమటి రవి, బానోత్ అశోక్,లైన్మెన్ షాదుల్లా,పట్టణ హెల్పర్ ఎండీ. శౌకత్,ఆపరేటర్లు సుధాకర్,యాదగిరి,నారాయణ,ఆర్టిజన్ లు కిషన్,అశోక్,తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు.

## ధర్మన్నగూడలో 80 వ స్వతంత్ర దినోత్సవం వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు




హైదరాబాద్ ఎస్టేట్ యాచారం ప్రతినిధి రామాచారి ఆగస్టు 15

రంగారెడ్డి జిల్లా యాచారం మండలం ధర్మన్నగూడ గ్రామంలో ఘనంగా గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సర్పంచ్ పద్మావతి బాల్ రాజ్ 80 స్వతంత్రం సందర్భంగా ప్రజలందరికీ నా హృదయపూర్వక నమస్కారములు. తెలియజేసి అనంతరం జాతీయ గీతాన్ని ఆలాపించి మనం ఎంతో గర్వంగా ఆనందంగా జరుపుకుంటున్న 80 స్వతంత్ర దినోత్సవ శుభ సందర్భంగా మన దేశం కోసం ప్రాణాలు అర్పించిన స్వతంత్ర సమరయోధులకు నివాళులు అర్పించారు . ఈ పవిత్ర దినం మన ధర్మన్నగూడ గ్రామాన్ని అన్ని రంగాలలో ముందుకు తీసుకువెళ్తానని అన్నారు చేయబోయే అభివృద్ధి కార్యక్రమాల గురించి మీతో పాలు పంచుకోవడం నాకు చాలా ఆనందంగా ఉంది మన గ్రామంలో చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలు మౌలిక వసతులు మన గ్రామంలో రోడ్ల నిర్మాణం డ్రైనేజీ వ్యవస్థ మొదలగు మరియు తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా నిరంతరం కృషి చేస్తామన్నారుప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీరు అందించడమే మన ప్రథమ కర్తవ్యం పరిశుభ్రత పచ్చదనం మన గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడానికి పల్లె ప్రగతి స్ఫూర్తితో చెత్త సేకరణ వీధుల శుభ్రతను నిత్యం పర్యవేక్షిస్తున్నాం అలాగే గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించడానికి ఇతమైన మొక్కలని నాటడం వాటిని సంరక్షించడం జరుగుతుంది. అన్నారు విద్య మరియు ఆరోగ్యం మన గ్రామ పిల్లలకు మేలుగైన విద్య అందేలా పాఠశాల అభివృద్ధికి అలాగే ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం వైద్య సేవలను అందుబాటులో తెచ్చేందుకు కృషి చేస్తున్నాం ప్రభుత్వ సంక్షేమ పథకాలు అరుహులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాలు అందేలా పారదర్శకతతో గ్రామ అభివృద్ధి అనేది ఒకరితో సాధ్యం కాదు మనమందరం ఒక కుటుంబంలో ఐక్యంగా ఉంటూ మన ధర్మన్నగూడను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరుకుంటున్నాను మరియు యువత చెడ్డ మార్గములకు వెళ్లకుండా చూసుకోవలసిన బాధ్యత మాపై తల్లిదండ్రులపై ఉందని పండుగ పద్మావతి బాల్రాజ్ . ముగించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నాగరాజు వార్డు సభ్యులు గ్రామ పెద్దలు యువకులు మహిళలు పాల్గొన్నారు

## నల్సార్ విద్యార్థులకు క్షమాపణ చెప్పిన బీసీఐ చైర్మన్




నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా విద్యార్థులకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా క్షమాపణలు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం ఆయన ఒక లేఖను విడుదల చేశారు. ఈ వివాదానికి సంబంధించి తాను రాసిన లేఖ లేదా చేసిన వ్యాఖ్యలు విద్యార్థుల మనోభావాలను దెబ్బతీసి ఉంటే, అందుకు క్షమించాలని ఆయన కోరారు. "విచారం వ్యక్తం చేయడం అనేది ప్రతిష్ఠకో లేదా అహంకారానికి సంబంధించిన విషయం కాదు. మన విద్యార్థుల భావాలకు, వారి ఆందోళనలకు విలువ ఇవ్వడమే అత్యంత ముఖ్యం" అని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. నల్సార్ 2026 గ్రాడ్యుయేట్ బ్యాచ్ విద్యార్థులను న్యాయవాదులుగా నమోదు చేయవద్దంటూ బీసీఐ ఇటీవల రాష్ట్ర బార్ కౌన్సిళ్లకు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ హాజరుకావడాన్ని సుమారు 450 మంది విద్యార్థులు వ్యతిరేకించడంతో బీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. నీట్-యూజీ పేపర్ లీక్ వ్యవహారంలో విద్యార్థుల నిరసనలకు సంబంధించిన పిటిషన్లపై జస్టిస్ సూర్యకాంత్ స్పందించిన తీరును ఆక్షేపిస్తూ వారు ఈ నిరసన తెలిపారు. అయితే, బీసీఐ ఉత్తర్వులపై సోషల్ మీడియాలో తీవ్ర వ్యతిరేకత రావడంతో గంటల వ్యవధిలోనే ఆ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకున్నారు. ఈ వివాదంపై జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉంటుందని, ఈ విషయంలో బీసీఐ జోక్యం అనవసరమని ధర్మాసనం స్పష్టం చేసింది. తాజాగా బీసీఐ చైర్మన్ బహిరంగంగా క్షమాపణలు చెప్పడంతో ఈ వివాదం సద్దుమణిగింది.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
16 ఆదివారం ఆగస్టు 2026

# ఆర్ అండ్.బి ఉద్యోగి సంగేపు నర్సింలుకు అరుదైన గౌరవం






మెదక్,ఆగస్టు 15(తెలంగాణ గళం): 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మెదక్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్ ప్రాంగణంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా ఇన్చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ,దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ఎందరో మహనీయులు చేసిన త్యాగాలను స్మరించుకున్నారు.వారి పోరాటాలు,త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని పేర్కొన్నారు.అనంతరం పోలీస్ గ్రౌండ్లో జిల్లా ముఖ్య అతిథులు ప్రేక్షకులు సాంస్కృతిక కార్యక్రమాలను తిలగించారు అనంతరం. జిల్లాలో ఉత్తమప్రతిభ కనబరిచిన జిల్లా అధికారులకు,సహా ఉద్యోగులకు మంత్రి వేక్ వెంకటస్వామి,జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు చేతుల మీదుగా ఉత్తమ ప్రశంసా పత్రాల అందించారు.ఈ సందర్భంగా మెదక్ జిల్లా రోడ్డు భవనంల శాఖ లో గ్యాంగ్ మాన్ గా గత 45 సంవత్సరాల నుండి విధులు నిర్వహిస్తున్న సంగెపు నర్సింలుకు ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేను గత 42 సంవత్సరాల నుండి ఎన్నో సేవా కార్యక్రమాలు మా ఉన్నత ఉద్యోగుల సహకారంతో నా తోటి ఉద్యోగుల సహకారంతో నాకు ఈ ఉత్తమ అవార్డు లభించింది అని ఆయన తెలిపారు.ఈ అవార్డు గెలుపొందినందుకు నా తోటి ఉన్నత ఉద్యోగులకు నాతో పని చేసిన సహకార ఉద్యోగులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్న అని ఆయన కోరారు. ఇలాంటి సహకారం మా శాఖ నుండి ఎల్లప్పుడూ నాకు మరియు అతని ఉద్యోగులకు సహకారం ఉండాలని ఆయన కోరారు.ఈఅవార్డు రావడంతో ఎంతో సంతోషంగా ఉందని నాకు ఈ అవార్డు రావడానికి సహకరించిన నాతోటి మిత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను అని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. శంకర్,డిప్యూటీ ఇంజనీర్ కె.వెంకటేశం,పి ఏ ఈ ఈ ఇ.కరుణ,ఏఈఈఏచ్ అరుణ్ రెడ్డి,ఏఈఈ విజయ సారధి,ఏఈఈ రవికుమార్,ఏఈఈ అవినాష్,డిఏఓ శ్రవణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దేశ ప్రజలందరికీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు.

హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) హైదరాబాద్

తోలుపునూరి రమేష్ గౌడ్
బిజెపి ఓబీసీ మోర్చా సోషల్ మీడియా కో-కన్వీనర్
మహంకాళి, సికింద్రాబాద్






ఈ పవిత్ర దినోత్సవం సందర్భంగా కవాడిగూడ డివిజన్ లోని వివిధ బస్తీలలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. కవాడిగూడ డివిజన్ అధ్యర్యంలో ఇందిరా పార్క్ చౌరస్తా దగ్గర కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బండా నగర్ బస్తీలో మహంకాళి, సికింద్రాబాద్ జిల్లా బిజెపి అధ్యక్షులు శ్రీ గుండగోని భరత్ గౌడ్ చేతుల మీదుగా జెండా ఆవిష్కరణ జరిగింది.అదేవిధంగా కవాడిగూడ డివిజన్ ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్ శ్రీమతి రచన శ్రీ వివేకానంద స్కూల్ - ఎన్.టీ.ఆర్ స్టేడియం వద్ద,బండ మైసమ్మ నగర్,రోటరీ కాలనీ,శివాజీ చౌక్, స్విమ్మింగ్ పూల్ వద్ద వున్న బస్తి లో మరియు మరికొన్ని బస్తీలలో జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది.ఈ మహోన్నత కార్యక్రమంలో పాల్గొన్నవారు. జిల్లా కార్యదర్శి సలాంద్రి శ్రీనివాస్ యాదవ్, మాజీ కార్పొరేటర్ రవీందర్, డివిజన్ అధ్యక్షులు సలాంద్రి దిలీప్ యాదవ్, మాజీ అధ్యక్షులు మహేందర్ బాబు, సీనియర్ నాయకులు వెంకటేష్, పరిమల్ కుమార్, ఆంజనేయులు, లింగం గౌడ్, పి.ఎన్ చారి, సురేష్ ముదిరాజ్, కుమార్ గౌడ్, ప్రభాకర్ గంగపుత్ర, లిప్రేమ్ కుమార్,శ్రీనివాసు ముద్రాజ్, రమేష్ బాబు, టిఫిన్ శ్రీనివాస్,రవి కుమార్, గంట శ్రీనివాస్, సూర్యనారాయణ గౌడ్ ,గద్ది శ్రీనివాస్,లినరసింహ చారి వాసు, శివ రాజ్,మరియు పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# దేశమే ప్రథమం.. వికసిత్ భారత్ లక్ష్యం

## - 2047 నాటికి భారత్‌ను అగ్రగామి దేశంగా నిలిపే దిశగా మోదీ ప్రభుత్వం కృషి

## - గంట రవికుమార్



వరంగల్, ఆగష్టు 15 హైదరాబాద్ ఎస్టేట్: ధర్మారంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పార్టీ శ్రేణులు, జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుని నివాళులర్పించారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ.. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన అగ్రగామి దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం 'వికసిత్ భారత్' సంకల్పంతో ముందుకు సాగుతోందన్నారు. దేశ ప్రగతితోపాటు పేదలు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. కుల, మత, ప్రాంత భేదాలకు అతీతంగా దేశ ప్రయోజనాలను ముందుంచడమే నిజమైన జాతీయత అని పేర్కొన్నారు. దేశ రక్షణ, అభ్యున్నతిలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని, దేశభక్తి, జాతీయ భావనతో సేవ చేయడమే అమరవీరులకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. సమాజంలోని చివరి వ్యక్తికీ అభివృద్ధి ఫలాలు అందేలా పనిచేయాలన్న లక్ష్యంతో బీజేపీ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాల పట్ల అంకితభావంతో ప్రజాసేవలో ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణ, మాజీ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల అశోక్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మల్లాడి తిరుపతిరెడ్డి, రాష్ట్ర నాయకులు కంభంపాటి పుల్లారావు, త్రిలోక్, జిల్లా పదాధికారులు, వివిధ మోర్చాల జిల్లా అధ్యక్షులు, నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# త్యాగాల స్ఫూర్తితో దేశ నిర్మాణానికి కృషి చేయాలి

## - దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుతూ అభివృద్ధి పథంలో సాగాలి

## చల్లా ధర్మారెడ్డి



పరకాల, ఆగష్టు 15 హైదరాబాద్ ఎస్టేట్: 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పరకాల పట్టణంలో శనివారం నిర్వహించిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జెండాకు గౌరవ వందనం సమర్పించి, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన సమరయోధులను స్మరించుకున్నారు. ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే నేడు స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని అన్నారు. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుకుంటూ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. యువత దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# రంగులు కాదు.. కొత్త పనులు చూపాలి

## బీఆర్ఎస్ హయాంలో మంజూరైన పనులకే ప్రారంభోత్సవాలు

## చల్లా ధర్మారెడ్డి



పరకాల, ఆగష్టు 15 హైదరాబాద్ ఎస్టేట్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ సహకారంతో పరకాల ప్రజల ఆకాంక్షల మేరకు మంజూరై పూర్తయిన అభివృద్ధి పనులకు రంగులు వేసి, వాటినే కొత్త పనులుగా ప్రచారం చేసుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి విమర్శించారు. రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో పరకాల పట్టణానికి కొత్తగా చేపట్టిన అభివృద్ధి పనులు ఏమిటో ప్రజలకు చూపించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో మంజూరై పూర్తయిన 100 పడకల ఆసుపత్రిని ఇంతకాలం ప్రజలకు ఎందుకు అందుబాటులోకి తీసుకురాలేకపోయారో ఎమ్మెల్యే ఆత్మవిమర్శ చేసుకోవాలని అన్నారు. ఆసుపత్రికి అవసరమైన పరికరాలు అందుబాటులో లేవని, సిబ్బంది నియామకాలు కూడా పూర్తికాలేదని పేర్కొన్నారు. సిబ్బంది నియామకాలను పారదర్శకంగా చేపట్టి ఆసుపత్రిని పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. డిగ్రీ కళాశాల సహా బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన పనులకు రంగులు వేయడం, ప్రారంభోత్సవాలు చేయడం అభివృద్ధి కాదని చల్లా ధర్మారెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా చేపట్టిన ఒక్క అభివృద్ధి పనినైనా ప్రజలకు చూపించాలని సవాల్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

## కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

## తహసీల్దార్ విజయలక్ష్మి



పరకాల, ఆగష్టు 15 హైదరాబాద్ ఎస్టేట్: పట్టణంలోని రెండో వార్డులో చేగువేరా యూత్ ఆధ్వర్యంలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. యూత్ అధ్యక్షుడు బొచ్చు అనిల్, ప్రధాన కార్యదర్శి బొచ్చు కళ్యాణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరకాల తహసీల్దార్ విజయలక్ష్మి హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ.. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ మంచి మార్గంలో నడవాలని సూచించారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగడంతోపాటు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. యువత దేశ, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించి సమాజానికి ఉపయోగపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెండో వార్డు కౌన్సిలర్ బొచ్చు శ్యామల బాబురావు, బొచ్చు సంపత్, బొచ్చు రమేష్, బొచ్చు కరుణాకర్, ఒంటేరు గోపి, చక్రి, కిషోర్, సునీల్, చరణ్, కళ్యాణ్, సందీప్, తరుణ్, ఈశ్వర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత గ్రామంగా పాపయ్యపేట

## స్వాతంత్ర్య వేడుకల్లో పర్యావరణ పరిరక్షణకు పిలుపు..

## గ్రామపంచాయతీకి 100 స్టీల్ ప్లేట్లు అందజేత





చెన్నారావుపేట, ఆగష్టు 15 హైదరాబాద్ ఎస్టేట్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పాపయ్యపేట గ్రామంలో జాతీయ పతాకావిష్కరణతో పాటు ప్లాస్టిక్ రహిత గ్రామ నిర్మాణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పునర్వినియోగ వస్తువులను ప్రోత్సహించడం, గ్రామాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో తీర్చిదిద్దడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామ సర్పంచ్ సుదర్శన్‌గౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాతీయ సమైక్యత, సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని గ్రామస్థులకు సూచించారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు పర్యావరణహిత పద్ధతులను పాటిస్తూ గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించే చర్యల్లో భాగంగా గ్రామపంచాయతీకి 100 స్టీల్ ప్లేట్లను అందజేశారు. గ్రామంలో జరిగే వేడుకలు, సమావేశాలు, ఇతర కార్యక్రమాల్లో ఒక్కసారి వినియోగించి పడేసే ప్లాస్టిక్ ప్లేట్లకు బదులుగా పునర్వినియోగించగల స్టీల్ ప్లేట్లను ఉపయోగించేలా ప్రజలను ప్రోత్సహించారు. ఈ విధానం ద్వారా గ్రామంలో ప్లాస్టిక్ వ్యర్థాల ఉత్పత్తిని తగ్గించడంతోపాటు పరిశుభ్రమైన వాతావరణాన్ని కాపాడుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంతో స్ఫూర్తి పొందిన గ్రామస్థులు కూడా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు తమవంతు సహకారం అందించేందుకు ముందుకు వచ్చారు. స్టీల్ ప్లేట్లు, గ్లాసులు అందిస్తూ ప్లాస్టిక్ రహిత గ్రామ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సంకల్పించారు. పర్యావరణ పరిరక్షణను ఒకరోజు కార్యక్రమానికే పరిమితం చేయకుండా నిరంతరం కొనసాగించాలని నిర్వాహకులు కోరారు. సెంటర్ ఫర్ పీపుల్ ఫారెస్ట్రీ, బెటర్ కాటన్ ఇనిషియేటివ్ ప్రతినిధుల సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో ఉప సర్పంచ్ సారంగం, పంచాయతీ కార్యదర్శి రాజు, పుంపు ఉదయ్‌కిరణ్, ఫీల్డ్ ఫెసిలిటేటర్లు శృతి, రమేష్, ప్రియాంక, తిరుపతి, గణేష్, రాజు, కుమారస్వామి, ఈర్య, సంతోష్, సందీప్, శివరాజు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, రైతులు, మహిళా నాయకులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
hyderabadestate.co.in



# హక్కుల కోసం ఉద్యమిద్దాం

## జాతీయోద్యమ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడాలి

## వినయ్‌భాస్కర్




హనుమకొండ, ఆగస్టు 15 హైదరాబాద్ ఎస్టేట్:
జాతీయోద్యమ స్ఫూర్తితో ప్రజల హక్కుల సాధనకు పోరాడాలని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. భారతమాత, మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం వినయ్‌భాస్కర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం ఎందరో సమరయోధుల త్యాగాలు, పోరాటాల ఫలితమన్నారు. మహాత్మాగాంధీ అహింస, శాంతియుత మార్గంలో ఉద్యమాన్ని నడిపారని, సుభాష్‌చంద్రబోస్, భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు, చంద్రశేఖర్ ఆజాద్ వంటి వీరులు దేశం కోసం ప్రాణత్యాగాలు చేశారని గుర్తుచేశారు. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు గడిచినా రైతులు, విద్యార్థులు తమ హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాల్సి వస్తోందని అన్నారు. ప్రజల హక్కుల పరిరక్షణ కోసం జాతీయోద్యమ స్ఫూర్తితో బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన సైతం సుదీర్ఘ ప్రజా ఉద్యమ ఫలితమేనని వినయ్‌భాస్కర్ పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో శాంతియుత ఉద్యమం ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించామని అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. ఆరు గ్యారంటీలు, ఇతర హామీల అమలుపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలు, హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ ప్రజల తరపున పోరాడుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గాంధీనగర్‌లో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

## జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన వెంకట రాజిరెడ్డి




హనుమకొండ, ఆగస్టు 15 హైదరాబాద్ ఎస్టేట్:
హనుమకొండ 57వ డివిజన్ గాంధీనగర్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. గాంధీనగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకట రాజిరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కాలనీలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. దేశభక్తి నినాదాలతో ర్యాలీ కొనసాగగా.. కాలనీవాసులు, యువత, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చేతుల్లో జాతీయ జెండాలతో వీధుల్లో ర్యాలీ నిర్వహిస్తూ స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తిని చాటారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను నిత్యం స్మరించుకోవాలని అన్నారు. దేశ ఐక్యత, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కాలనీ సమస్యల పరిష్కారంతోపాటు గాంధీనగర్ అభివృద్ధికి కమిటీ ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో గాంధీనగర్ అభివృద్ధి కమిటీ సభ్యులు, కాలనీవాసులు, మహిళలు, యువత, చిన్నారులు పాల్గొన్నారు.

# మచ్చాపూర్ పోలీసుల ఘనత

## ఒకే రోజు మూడు జిల్లాల్లో సేవా పురస్కారాలు







గీసుకొండ, ఆగస్టు 15 హైదరాబాద్ ఎస్టేట్:
గీసుకొండ మండలం మచ్చాపూర్‌కు చెందిన ముగ్గురు పోలీసు ఉద్యోగులు ఒకే రోజు మూడు జిల్లాల్లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సేవా పురస్కారాలు అందుకున్నారు. కరీంనగర్, హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో జరిగిన కార్యక్రమాల్లో బిల్ల కోటేశ్వర్, బోడకుంట్ల రాజమౌళి, బల్సుకూరి పెద్దిరాజులు తమ సేవలకు గుర్తింపుగా పురస్కారాలు అందుకున్నారు. కరీంనగర్ జిల్లా కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓగా పనిచేస్తున్న బిల్ల కోటేశ్వర్ కరీంనగర్‌లో జరిగిన వేడుకల్లో బీసీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చేతుల మీదుగా విశిష్ట సేవా పతకాన్ని అందుకున్నారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తదితరులు పాల్గొన్నారు. కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బోడకుంట్ల రాజమౌళి హనుమకొండలో జరిగిన వేడుకల్లో సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా విశిష్ట సేవా పతకాన్ని అందుకున్నారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత తదితరులు పాల్గొన్నారు. వరంగల్ జిల్లా టాస్క్‌ఫోర్స్ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బల్సుకూరి పెద్దిరాజు వరంగల్‌లో జరిగిన వేడుకల్లో అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, డీసీపీ అంకిత్‌కుమార్ తదితరులు అభినందించారు. ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు పోలీసు ఉద్యోగులు ఒకే రోజు మూడు జిల్లాల్లో పురస్కారాలు అందుకోవడం పట్ల మచ్చాపూర్ గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు ముగ్గురినీ అభినందించారు.

# ఖిలా వరంగల్‌లో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

## సహజ రాఖీలకు మంత్రి కొండా సురేఖ ప్రశంసలు..

## పారిశుధ్యం, ప్లాస్టిక్ నివారణపై దిశానిర్దేశం



వరంగల్, ఆగస్టు 15 హైదరాబాద్ ఎస్టేట్:
చారిత్రక ఖిలా వరంగల్‌లోని కుశమహల్ ఆవరణలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జిల్లా యంత్రాంగం శనివారం ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఏర్పాటు చేసిన సహజ రాఖీలు, ప్లాస్టిక్ రహిత జీవన విధానంపై ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. మంత్రి కొండా సురేఖ, కలెక్టర్ సత్యశారదతో కలిసి స్టాళ్లను పరిశీలించారు. ఆకులు, పూలు, ఎండుఫలాలు, పప్పుధాన్యాలతో రూపొందించిన సహజ రాఖీలను మంత్రి, కలెక్టర్ పరిశీలించారు. జాతీయ పతాక స్ఫూర్తిని ప్రతిబింబించేలా రూపొందించిన రాఖీలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. సహజ పదార్థాలతో సృజనాత్మకంగా రాఖీలు రూపొందించిన పంచాయతీరాజ్ శాఖ అధికారులు, సిబ్బందిని మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, పర్యావరణ పరిరక్షణపై మంత్రి అధికారులతో మాట్లాడారు. గ్రామాల్లో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సేకరించిన తడి చెత్తతో కంపోస్ట్ ఎరువు తయారు చేసి రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులకు బదులుగా పునర్వినియోగ పాత్రలను వినియోగించేలా ప్రోత్సహించాలని అన్నారు. పరిశుభ్రమైన గ్రామాలు, పర్యావరణ పరిరక్షణకు అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంధ్యారాణి, వై.వి. గణేష్, జిల్లా పంచాయతీ అధికారి కటకం కల్పన, డీఎల్‌పీవో వేదవతి, ఎంపీడీవో పాక శ్రీనివాస్, ఎంపీవోలు శేషాంజన్ స్వామి, కూచన ప్రకాష్, హర్షిత్, జుమ్మిలాల్, పంచాయతీ కార్యదర్శులు రజిత, మహేందర్, ప్రశాంత్, ఈ–పంచాయతీ ఆపరేటర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వరికి బదులు పెసర సాగు చేపట్టాలి

## చెరువుల్లోకి నీరు చేరని పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటపై వ్యవసాయ శాఖ సూచన..

## సబ్సిడీపై ఎంజీజీ-385 విత్తనాలు సిద్ధం






గీసుకొండ, ఆగస్టు 15 హైదరాబాద్ ఎస్టేట్:
చెరువుల్లోకి నీరు చేరని పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆయకట్టు భూముల్లో వరికి బదులుగా స్వల్పకాలిక పెసర సాగు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి పి. హరిప్రసాద్ బాబు రైతులకు సూచించారు. అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా పంటల ప్రణాళికను మార్చుకుని ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచే చర్యల్లో భాగంగా కొనాయమాకుల వ్యవసాయ శాఖ కార్యాలయంలో 5 క్వింటాళ్ల ఎంజీజీ–385 (మధిర–385) రకం పెసర విత్తనాలు సబ్సిడీపై పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంజీజీ–385 రకం పెసర వానాకాలం, యాసంగి, వేసవి సీజన్లకు అనుకూలమని తెలిపారు. పంట కాలపరిమితి సుమారు 6065 రోజులు ఉంటుందని, సగటున ఎకరానికి 68 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. గింజలు మధ్యస్థ పరిమాణంలో నాణ్యంగా ఉండటంతోపాటు కాయలు ఏకకాలంలో పక్వానికి వస్తాయని తెలిపారు. పచ్చ/పల్లాకు తెగులును సమర్థంగా తట్టుకునే సామర్థ్యం ఈ రకానికి ఉందన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు తమ క్లస్టర్ ఏఈవోలను సంప్రదించాలని సూచించారు. పట్టాదారు పాస్‌బుక్ ప్రతితోపాటు ఆధార్ కార్డు ప్రతిని, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్‌ను తీసుకెళ్లాలని తెలిపారు. విత్తన శుద్ధి, సరైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా పంటను సమర్థంగా సాగు చేసుకోవచ్చని హరిప్రసాద్ బాబు తెలిపారు. తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడి, మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతకు అనుగుణంగా పంటను ఎంపిక చేసుకుని వ్యవసాయ శాఖ సూచనల మేరకు సాగు పద్ధతులు పాటించాలని రైతులకు సూచించారు.

పి. హరిప్రసాద్ బాబు
మండల వ్యవసాయ అధికారి, గీసుకొండ

# సిద్ధార్థ గురుకులంలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

## విద్యార్థుల కవాతు, పిరమిడ్లు, యోగా విన్యాసాలు ఆకట్టుకున్నాయి






చెన్నారావుపేట, ఆగస్టు 15 హైదరాబాద్ ఎస్టేట్:
చెన్నారావుపేట మండలంలోని సిద్ధార్థ గురుకుల ఉన్నత పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన వేడుకల్లో సుమారు వెయ్యి మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన కవాతు, పిరమిడ్లు, యోగా విన్యాసాలు, బ్యాండ్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. క్రమశిక్షణతో సాగిన విద్యార్థుల ప్రదర్శనలను వేడుకలకు హాజరైన అధికారులు, గ్రామ పెద్దలు, ప్రజలు ఆసక్తిగా తిలకించారు. విద్యార్థుల ప్రతిభను చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి, ప్రిన్సిపల్ కర్ణాకర్‌రెడ్డి, డైరెక్టర్ మాధవరెడ్డి అభినందించారు. విద్యతోపాటు క్రమశిక్షణ, దేశభక్తి, సామాజిక బాధ్యతను అలవర్చుకుని ఉన్నత లక్ష్యాల వైపు సాగాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# టెక్స్‌టైల్ పార్క్ ప్రమాదంపై న్యూడెమోక్రసీ ఆరోపణలు

## యాజమాన్య నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ..

## మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్




గీసుకొండ, ఆగస్టు 15 హైదరాబాద్ ఎస్టేట్:
శాయంపేట హవేలీ గ్రామంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో జరిగిన అగ్ని ప్రమాదానికి యాజమాన్య నిర్లక్ష్యమే కారణమని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు ఆరోపించారు. ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. న్యూడెమోక్రసీ నాయకులు పార్క్‌లోని గణేశ్ ఎకోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను సందర్శించి కార్మికులను అడిగి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదానికి ముందు పైపుల నుంచి చమురు లీకవుతున్న విషయాన్ని కార్మికులు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని వారు ఆరోపించారు. అనంతరం మంటలు వ్యాపించి పలు అంతస్తుల్లోని యంత్రాలు, ప్లాస్టిక్ సామగ్రి దగ్ధమైనట్లు తెలిపారు. మంటలు వ్యాపించిన సమయంలో కార్మికులను సురక్షితంగా బయటకు తరలించేందుకు, అగ్నిని అదుపు చేసేందుకు తగిన ఏర్పాట్లు లేవని నాయకులు ఆరోపించారు. ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందగా, మరికొందరు గాయపడ్డారని తెలిపారు. మృతుల కుటుంబాలకు యాజమాన్యం ప్రకటించిన పరిహారం సరిపోదని, ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షలు చెల్లించాలని కోరారు. టెక్స్‌టైల్ పార్క్‌లోని కొన్ని పరిశ్రమల్లో కార్మికులతో నిర్ణీత పనివేళలకు మించి పనిచేయిస్తున్నారని, కార్మిక చట్టాల ప్రకారం వేతనాలు చెల్లించడం లేదని నాయకులు ఆరోపించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులకు మెరుగైన వసతి, భద్రతా సౌకర్యాలు కల్పించాలని, వారి పిల్లలకు విద్యా సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్క్‌లోని అన్ని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలపై అధికారులు సమగ్ర తనిఖీలు నిర్వహించాలని బాలరాజు కోరారు. ప్రస్తుత ప్రమాదంపై పూర్తిస్థాయి విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బండి కోటేశ్వరరావు, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పూలక్క, పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్, లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
16 ఆదివారం ఆగస్టు 2026

# మద్దిరాల లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల (ప్రతినిధి) మండల కేంద్రంలో శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయులను స్మరించుకుంటూ దేశాభివృద్ధి, సమైక్యత, సమగ్రత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చరు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల అధికారులు అన్నారు. శనివారం మండలం లో 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అధికారులు విద్యార్థి నాయకులు వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## కొలను గూడా లో ఘనంగా స్వతంత్ర దినోత్సవ వేడుకలు



హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి ఆగస్టు 15
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ కందుకూర్ మండలం కొలనుగూడ గ్రామంలో 80 వ స్వతంత్ర దినోత్సవ సందర్భంగా గ్రామంలో ఉన్న స్కూల్ కి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని మాట ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ బండరాజు, మాట్లాడుతూ చదువు యొక్క విశిష్టతను కొనియాడారు మంచిగా చదివిన విద్యార్థికి ఎప్పుడు వాళ్ల వెనుక ఉండి ప్రోత్సహిస్తామన మాట ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు వేణుగోపాలకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ బండ రాజు, ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్ రెడ్డి, ఉపాధ్యాయుడు ప్రభాకర్, గ్రామ పెద్దలు యువకులు విద్యార్థిని విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## పదవ తరగతి లో 550 మార్కుల ఉత్తీర్ణులైన విద్యార్థినికి ఉపసర్పంచ్ సంగారెడ్డి పదివేల రూపాయలు బహుమతి



హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి ఆగస్టు 15
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామంలో 80 వ స్వతంత్ర దినోత్సవ సందర్భంగా టెన్త్ క్లాస్ టాపర్ ఆకంపల్లి పల్లవికి ఉప సర్పంచ్ సంగారెడ్డి పదివేల రూపాయలు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంగారెడ్డి మాట్లాడుతూ చదువు యొక్క విశిష్టతను కొనియాడారు మంచిగా చదివిన విద్యార్థికి ఎప్పుడు వాళ్ల వెనుక ఉండి ప్రోత్సహిస్తామని ఉపసర్పంచ్ సంగారెడ్డి మాట ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆండాలు కృష్ణ యాదవ్ కడారి జంగయ్య యాదవ్ ఆమనగంటి ప్రశాంత్ రెడ్డి ప్రధానోపాధ్యాయుడు చంద్రమౌళి గ్రామ పెద్దలు యువకులు విద్యార్థిని విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## స్వతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రజల అవసరాల నిమిత్తం వాటర్ ట్యాంకర్ బహుకరణ మాజీ సర్పంచ్ కాసుల సురేష్

### కాసుల లక్ష్మయ్య గారి జ్ఞాపకార్థం గా వాటర్ ట్యాంకర్ బహుకరణ









( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి ఆగస్టు 15:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని సిరిగిరిపురం గ్రామంలో.. మాజీ సర్పంచ్ కాసుల సురేష్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజలందరికీ 79 సంవత్సరాలు పూర్తి చేసుకుని 80 వ స్వతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఎందరో త్యాగమూర్తుల ఫలితమే నేడు స్వతంత్ర దినోత్సవం అని తెలియజేస్తూ ప్రజల బాధ్యతలు తెలిసిన వ్యక్తిగా గ్రామంలో ఉన్న సమస్యలు తెలుసుకుని గ్రామ ప్రజలకు వాటర్ సమస్య ఉండకూడదనే ఉద్దేశంతో వాటర్ ట్యాంకర్ ని స్వతంత్ర దినోత్సవ సందర్భంగా అందజేసినట్టు గ్రామ సర్పంచ్ తెలియజేశారు ఈ యొక్క కార్యక్రమంలో పాలకవర్గంతో పాటు పెద్దలు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నట్టు తెలియజేశారు

## గొర్రెకుంట పాఠశాలకు సీసీ కెమెరాలు రైతు సేవా సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు.. ప్రారంభించిన సీఐ విశ్వేశ్వర్



గీసుకొండ, ఆగస్టు 15 హైదరాబాద్ ఎస్టేట్:
విద్యార్థుల భద్రతకు మరింత భరోసా కల్పించేలా గొర్రెకుంట గ్రామ ప్రభుత్వ పాఠశాలలో రైతు సేవా సొసైటీ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం గీసుకొండ సీఐ విశ్వేశ్వర్ వాటిని ప్రారంభించారు. పాఠశాల ప్రాంగణం, పరిసరాలను నిరంతరం పర్యవేక్షించేందుకు కెమెరాలు ఉపయోగపడనున్నాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులకు సురక్షిత వాతావరణం కల్పించడంలో ఈ చర్య దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. పాఠశాల భద్రతకు సొసైటీ సభ్యులు అందించిన సహకారానికి ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గొర్రెకుంట రైతు సేవా సొసైటీ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మచ్చాపూర్ సబ్‌స్టేషన్‌లో స్వాతంత్ర్య వేడుకలు

### సిబ్బందికి టార్చ్‌లైట్లు అందజేసిన ఏఈ సందీప్



గీసుకొండ, ఆగస్టు 15 హైదరాబాద్ ఎస్టేట్:
గీసుకొండ మండలం మచ్చాపూర్ గ్రామ పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. అధికారులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలు నిర్వహించారు. అనంతరం ఏఈ సందీప్ విద్యుత్ సిబ్బందికి టార్చ్‌లైట్లను అందజేశారు. రాత్రివేళ విద్యుత్ అంతరాయాల సమయంలో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సిబ్బందికి ఇవి ఉపయోగపడతాయని తెలిపారు. విధి నిర్వహణలో భద్రతకు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్




రాజన్న సిరిసిల్ల జిల్లా: రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ గరిమా అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గీతేతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన వివిధ శకటాలను ఆయన ఆసక్తిగా తిలకించారు. జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. అలాగే వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించిన ఆది శ్రీనివాస్.. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు దేశభక్తి, జాతీయ స్ఫూర్తితో ఘనంగా నిర్వహించబడ్డాయి.








